
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5; కనిష్ఠం 24.3
నిజామాబాద్ జిల్లా వార్తలు
3
సోమవారం 14 ఏప్రిల్ 2025





భజనలు చేస్తున్న సిక్కులు



ప్రైవేటు ఆసుపత్రులపై.. నియంత్రణ ఏది?

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రైవేటు ఆసుపత్రుల ఆగడాలు
- అనవసరపు టెస్టుల పేరుతో దోపిడీ
- శని, ఆదివారాలైతే ప్రైవేటు వైద్యుల వీకెండ్ పార్టీలు
- నిబంధనలు అతిక్రమిస్తున్నా... పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిబంధనలను అతిక్రమిస్తు ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆసుపత్రులు వ్యవహరిస్తున్న తీరుపై రోగులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించని ప్రైవేటు ఆసుపత్రులు జిల్లాలో వందల సంఖ్యలో ఉన్నా. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. చికిత్స పేరుతో ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న రోగులను పరీక్షల పేరుతో నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. జ్వరంతో వచ్చిన వారికి, ఒళ్లు నొప్పులతో వచ్చిన వారికి టెస్టుల పేరుతో వేలాది రూపాయలను దండుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో ఇటీవల కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో కంపౌండర్లే వైద్యులుగా పరీక్షలు నిర్వహిస్తూ మందులు సైతం ఇవ్వడం వివాదాస్పదమైంది. గతం లోనూ నగరంలోని ఓ ఆసుపత్రిలో కంపౌండర్లే వైద్యులుగా పరీక్షలు చేయడం, ప్రిస్క్రిప్షన్ రాయడంపై రోగులు అభ్యంతరం వ్యక్తం చేసిన ఘటనలు జరిగాయి. అయినప్పటికీ ఇంకా ప్రైవేటు ఆసుపత్రుల్లో కంపౌండర్లే వైద్యులుగా చెలామణీ అవుతున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడే వైద్యాధికారులు హడావుడి చేస్తున్నారు తప్ప తర్వాత ఆ ఆసుపత్రులపై చర్యలకు వెనుకాడుతున్నారు. జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు వైద్యాన్ని వ్యాపారంగా మారుస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్ఎంపీలు, పీఎంపీలను ఏజెంట్లుగా నియమించుకొని వారి నుంచి రోగులను తమ ఆసుపత్రులకు వచ్చేలా ప్రణాళికలు రూపొం దించుకుంటున్నారు. తమ ఆసుపత్రులకు రోగులను పంపితే 50 నుంచి 60 శాతం కమీషన్‌లు ఇచ్చేలా ఆర్ఎంపీలకు, పీఎంపీలకు బంపర్ ఆఫర్‌లను ప్రైవేటు ఆసుపత్రులు ఇస్తున్నాయి. కమీషన్‌తో పాటు విదేశీ పర్యటనలు, విందులు, వినోదాలను అదనంగా కల్పిస్తూ తమ వైద్య వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. అన్ని తెలిసిన వైద్య ఆరోగ్య శాఖ చర్యలకు వెనుకాడుతుండటం విమర్శలకు తావిస్తోంది.

శని, ఆదివారాల్లో డాక్టర్లే ఉండరు

జిల్లాలోని ప్రైవేటు డాక్టర్ల తీరు విచిత్రంగా ఉంటుంది. అత్యవసర సమయాల్లో వైద్యం అందించాల్సిన డాక్టర్లు శని, ఆదివారాలు అయితే ఎవరికి అందుబాటులో ఉండకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు, గుండె జబ్బులు, ఇతరత్రా అత్యవసర చికిత్సల కోసం శని, ఆదివారాల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే ఎక్కడ చూసినా డాక్టర్ అందుబాటులో లేరనే సమాధానం వస్తుంది. శని, ఆదివారాల్లో కాన్ఫరెన్స్‌ల పేరుతో డాక్టర్లు హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ ఎంజా య్ చేస్తారనే విమర్శలు ఉన్నాయి. పెద్ద ఫార్మా కంపెనీలు డాక్టర్లకు వీకెండ్ పార్టీలు ఇవ్వడం ఆనవాయితీ కావడంతో ఇక్కడ రోగులకు ఇబ్బందులున్నా డాక్టర్లు మాత్రం వీకెండ్ పార్టీల పేరుతో ఎంజాయ్ చేస్తున్నారు. ఇక్కడ రోగులకు మాత్రం డాక్టర్లు కాన్ఫరెన్స్‌కు వెళ్లారు అనే పేరుతో మభ్య పెడుతున్నారు. పెద్ద కార్పొరేట్ ఆసుపత్రులు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్నా.. అత్యవసర పరిస్థితుల్లో మాత్రం రోగులు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. శని, ఆదివారాలు అయితే డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడంతో ఆసుపత్రుల్లో ఉన్న కంపౌండర్లే వైద్యులుగా చెలా మణీ అవుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. డాక్టర్లు లేకున్నా కంపౌండర్లే టెస్టులు చేస్తూ రోగులకు మందులు ఇస్తున్నారు. ఇలా కంపౌం డర్లు చేసిన వైద్యం వికటించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.



ఫిర్యాదులు వస్తేనే తనిఖీలు

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తేనే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో గతంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కంపౌండర్ ప్రిస్క్రిప్షన్ రాసిన వ్యవహారంతో పాటు ఇటీవల నగరంలోని ఓ కంటి ఆసుపత్రిలో కంపౌండర్ వైద్యం చేయడం ఘటనలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హడావుడి చేశారు. రోగుల నుంచి ఫిర్యాదులు రాగానే హడావుడి చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు.. ఆసుపత్రులపై చర్యల విషయంలో వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా ఎన్నో ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నా వాటిపై చర్యలకు మాత్రం వెనుకాడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నిరంతరం పర్యవేక్షణ లేక ప్రైవేటు ఆసుపత్రులు ఆడిందే ఆటగా పాడిందే పాటగా వ్యవహారం కొనసాగుతోంది.

అన్నీ లొసుగులే..

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులతో పాటు వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో అన్ని లొసుగులే ఉన్నాయి. అంతేకాకుండా ల్యాబ్‌లలో పని చేసే సిబ్బందికి ఎలాంటి అర్హతలు లేకుండా పరీక్షలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్లే యువకులు కచ్చితంగా రక్త పరీక్షలు చేయించుకోవాల్సి ఉండటంతో అదేఅదనుగా ఎలాంటి అర్హతలు లేకున్నా రక్తపరీక్షలు చేసి రిపోర్టులను ఇచ్చి భారీగా డబ్బులను వసూలు చేస్తున్నారు. ల్యాబ్‌లతో పాటు స్కానింగ్ సెంటర్లు కూడా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయి. కడుపునొప్పి, మూత్రపిండాల్లో రాళ్లు, ఇతరత్ర వ్యాధులకు స్కానింగ్ తప్పనిసరి కావడంతో ప్రైవేటు డాక్టర్లు తమకు వచ్చే కమీషన్ కోసం అనవసరంగా స్కానింగ్‌లు రాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో స్కానింగ్‌కు రూ.3వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చు అవుతుండగా.. ఇది రోగులకు అదనపు భారంగానే అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో టీ హబ్ పేరుతో 14 రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తున్నప్పటికీ.. రోగులు ప్రైవేటు ఆసుపత్రుల వైపే రావడంతో అదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయి.

ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేస్తున్నాం

: రాజశ్రీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, నిజామాబాద్



జిల్లా కేంద్రంలో ఇటీవల ప్రైవేటు ఆసుపత్రుల్లో కంపౌండర్లే డాక్టర్లుగా వ్యవహరించిన ఘటనపై ఫిర్యాదులు రాగానే తనిఖీలు నిర్వహించాం. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేసి పూర్తి నివేదిక ఇవ్వగానే సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం.

అంబేద్కర్‌ను రాజకీయంగా, మానసికంగా వేధించింది కాంగ్రెస్సే

- అంబేద్కర్ విగ్రహ శుద్ధి కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్



నీళ్లతో అంబేద్కర్‌ను శుభ్రం చేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు



అంబేద్కర్‌కు నమస్కరిస్తూ..

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీయే అంబేద్కర్‌ను రాజకీయంగా, మానసికంగా వేధించారని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ విమర్శించారు. బీజేపీ ఛలో గావ్, ఛలో బస్తీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి నీటితో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంబేద్కర్‌ను రాజకీయంగా వాడుకోవడం తప్ప.. గౌరవించింది లేదని అన్నారు. రాజకీయంగా, మానసికంగా హింసించి పనిగట్టుకొని లోక్‌సభలో రెండుసార్లు ఓడించిందన్నారు. ఏ మొఖం పెట్టుకొని కాంగ్రెస్ వారు అంబేద్కర్ పేరును వాడుతారని అన్నారు. రాజ్యాంగాన్ని అవమానించింది, రాజకీయంగా మోసం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంవత్సరాలు అధికారంలో ఉన్నా.. భారతరత్న ఇవ్వలేదని 1989లో బీజేపీ మద్దతుతోనే అంబేద్కర్‌కు భారతరత్న వచ్చిందన్నారు. అంబేద్కర్ పేరు పెట్టుకొని రాజకీయం చేయడం కాంగ్రెస్ పార్టీకి దీనికి మించిన సిగ్గుమాలిన చర్య ఉంకోటి ఉండదన్నారు. అంబేద్కర్ పుట్టిన స్థలం దీక్ష చేసిన స్థలం, తదితర ప్రాంతాలను కలుపుకొని పంచతీర్థాలుగా బీజేపీ ప్రభుత్వం, మోదీ అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న నీచరాజకీయాలు తొలగిపోవాలని దేశవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ ఎప్పుడూ సంచులు మోయదని, హిందుత్వ వాదాన్ని మాత్రమే మోస్తుందన్నారు. కవిత, రేవంత్‌రెడ్డిలే బస్తాలు మోస్తారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పడిపోయినా.. బుద్ధి రావడం లేదన్నారు. కేటీఆర్, కవిత వాళ్ల నాన్ననే తిట్టినవారు అన్నారు. వాళ్లకు రాజకీయ భిక్ష పెట్టిన కుటుంబం డీఎస్ కుటుంబం అన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, సినీ నటుడు పవన్ కళ్యాణ్‌కు రాజకీయాల్లోకి రాకముందే కోటి మందికి పైగా అభిమానులు ఉన్నారని, అందులో నేను ఒకడిని అని అన్నారు. పవన్ కళ్యాణ్ త్యాగం చేసి రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. కవిత ఏం త్యాగం చేసి వచ్చారని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అంబేద్కర్‌ను, బలహీన వర్గాలను పావులుగా వాడుకుంటుందని అన్నారు. బీజేపీ చొరవతోనే అంబేద్కర్‌కు భారతరత్న లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

- గీత కార్మికుల అభివృద్ధి కోసం కృషి చేస్తా

ధర్పల్లి: గీత కార్మికులు, గౌడ కులస్తుల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం ఎంపీ నివాసంలో మండల కేంద్రానికి చెందిన గౌడకులస్తులు ఏబీవీపీ రాష్ట్ర నాయకులు హరీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ అమ్మవారిని దర్శించుకుంటానని తెలిపారు.

ఘనంగా బైసాకి ఉత్సవం

- జిల్లాకేంద్రంలో గురుగ్రంథీలకు ఘనంగా నీరాజనాలు
- విన్యాసాలతో ఆకట్టుకున్న సిక్కులు



గురుగ్రంథీల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సిక్కులు పరమ పవిత్రంగా భావించే బైసాకి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గత మూడు రోజులుగా జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల గురుద్వారాలో గురుగ్రంథీలకు గ్రంథీసింగ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుభాష్‌నగర్‌లోని గురుద్వారా నుండి గురుగ్రంథీలను గ్రంథీసింగ్‌లు, భక్తులు భక్తిపాటలు పాడుకుంటూ ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి పూజలు చేశారు. బైసాకి ఉత్సవ ఊరేగింపు రైల్వే కమాన్, పోలీస్ కమిషనర్ కార్యాలయం, ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, బస్టాండ్, దేవిరోడ్, ఆర్పీ రోడ్, గాంధీచౌక్, నెహ్రూపార్క్, పోస్టాఫీస్ రోడ్, పెద్దబజార్, గాజుల్‌పేట్‌లోని గురుద్వారా వరకు ఊరేగింపు సాగింది. ఊరేగింపులోని గురుగ్రంథీలకు భక్తులు భక్తితో నీరాజనాలు పలికారు. అంతేకాకుండా యువకులు కర్ర, కత్తి విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గురుద్వారా ప్రబంధ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో సిక్కులు పాల్గొన్నారు.

- గురుద్వారాను సందర్శించిన పోలీస్ కమిషనర్

నిజామాబాద్ కల్చరల్: జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్‌లో గల గురుద్వారాను పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదివారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆయన గురుద్వారాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో గురుద్వారా ప్రబంధ కమిటీ సభ్యులతో గురుద్వారా గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రబంధ కమిటీ సభ్యులతో వివరాలను తెలుసుకుంటున్న సీపీ

బోధన్ మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖులు

బోధన్ రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని హైదరాబాద్‌లో ఆదివారం ఎమ్మెల్సీ కవిత దంపతులతో పాటు ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీలు వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షకీల్ మాతృమూర్తి మృతి పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సుభాష్‌నగర్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని షకీల్ నివాసంలో కలిసి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తల్లి కన్నుమూశారు. కాగా, షకీల్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టసమయంలో భగవంతుడు వారికి ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు.



బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత దంపతులు

సమస్యను పరిష్కరించే వరకు పోరాటం

- బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించాలి
- లేనియెడల పెద్దఎత్తున ఆందోళన చేస్తాం
- సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తాం : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ఏర్గట్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : తాళ్లరాంపూర్ గీతకార్మికుల సాంఘిక బహిష్కర సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పోరాడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలోని గీత కార్మికులకు సంబంధించిన ఈతవనంలో కాలిపోయిన చెట్లను సీపీఎం నాయకులు పరిశీలించారు. అనంతరం జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎప్పటిలాగే గీత కార్మికులు వీడీసీకి ప్రతీ సంవత్సరం డబ్బులు చెల్లిస్తామని చెప్పినా వినకుండా వీడీసీ సభ్యులు వారికి సంబంధించిన తాటి చెట్లను వీడీసీ లాక్కొంటామని బెదిరింపులకు గురిచేసి, తిరగబడితే వారిపై ఆంక్షల పేరుతో బహరిష్కరించడం, దేవాలయంలో గౌడ మహిళను అవమానించడం సరికాదన్నారు. మహిళలు సదరు వ్యక్తులపై ఠాణాలో ఫిర్యాదు చేస్తే.. వీడీసీ సభ్యులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడమేంటని, గత ఆరు నెలలుగా బహిష్కరణ చేయడమే కాక గ్రామంలో గీత కార్మికులకు అడ్డుకునేందుకు వీడీసీ సభ్యులు గస్తీని ఏర్పాటు చేసుకోడం, దాని కోసం సుమారు లక్షల ఖర్చు చేసుకొని వాటిని వారే భరించాలని వీడీసీ అనడం ఏంటని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా.. అధికార యంత్రాంగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఎవరిపైన కేసులు నమోదు అయ్యాయో వారికి వెంటనే జైలుకు తరలించాలన్నారు. గీతా కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 15, 16వ తేదీల్లో జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్‌లను, ఆర్డీవోలకు, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. వీడీసీ పెత్తనాలపై హైదరాబాద్‌లోని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు తాళ్లరాంపూర్ గీత కార్మికులకు అండగా ఉంటాయన్నారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు సీపీ, కలెక్టర్‌లు తాళ్లరాంపూర్ గ్రామాన్ని సందర్శించి గీతకార్మికులతో మాట్లాడి, ఎవరైతే పెత్తనం చేస్తున్నారో వాళ్లపై చట్టపరంగా కేసులు నమోదు చేసి జైల్లో పెట్టాలన్నారు. గీత కార్మికుల సమస్యను పరిష్కరించని యెడల రాష్ట్రస్థాయిలో చలో రాంపూర్ పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఇట్టి విషయాన్ని సీఎంతో పాటు డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్ద వెంకట్ రాములు, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు గౌడ్, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి ప్రసాద్, గొర్రెల మేకల పెంపకం దారుల రాష్ట్ర కార్యదర్శి ఉడత రవీందర్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సిఐటియూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు నూర్జాహాన్, అఖిల భారత మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుజాత, జంగం గంధార్, ఇచుతడి ఎల్లయ్య, భూమన్న, వ్యవసాయ కార్మిక సంఘం గంగారాం, రాజు, కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్‌లు, తాళ్లరాంపూర్ గీతా కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.



తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులతో మాట్లాడుతున్న జాన్ వెస్లీ



దగ్ధమైన ఈత చెట్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చలో వరంగల్ పోస్టర్ల ఆవిష్కరణ



వేల్పూర్‌లో చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లోని తన నివాసంలో ఆదివారం చలో వరంగల్ పోస్టర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో తలపెట్టనున్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు బాల్కొండ నియోజకవర్గం నుంచి అన్ని మండలాలు, గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నిజాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్

నవీపేట,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ జే.రాంచందర్ కోరారు. ఆదివారం మండలంలోని నిజాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజ్ గౌడ్, రమేష్, పెద్దన్న, బుచ్చన్న, బాలచందర్ గౌడ్, రమేష్ గౌడ్, గంగారాం, అంజాగౌడ్, ఏపీఎం భూమేష్ గౌడ్, గ్రామ సంఘం అధ్యక్షురాలు సాయమ్మ తదితరులున్నారు.

పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

మోర్తాడ్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. వీటి ధరలు పెంచడంతో దేశ ప్రజలపై పెనుభారం పడుతుందని జిల్లా నాయకులు కిషన్ ఆరోపించారు. ప్రధాని మోదీ 11 ఏళ్లుగా సంపన్నుడైన కార్పోరేట్ల కొమ్ముకాస్తు పేదలపై ధరలో పన్నులు పెంచి వారి వెన్ను విరుస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు, క్రుడాయిల్ రేట్‌లు తగ్గిన మన దేశంలో పెట్టుబడిదా రులకు వత్తాస్ పలుకుతూ ధరలు పెంచడం సిగ్గు చేటని అన్నారు. ఇప్పటికైన ప్రధాని మోదీ పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దయాసింగ్, దశరత్, గజానంద్, దర్శన్‌సింగ్, భూమన్న, గోవింద్ సింగ్, ఆటో యూనియన్ నాయకులు గంగాధర్, రమేష్, భూమన్న, చిన్నయ్య, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధి కోసం రూ. 75 వేల విరాళం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని విశాఖ కాలనీలో గల శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి శివ పంచాయతన పంచముఖ హనుమాన్ ఆలయానికి ఇనుప జాలి ఏర్పాటు నిమిత్తం దాత విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బెనికి నారాయణ, బెనికి లక్ష్మీ దంపతులు రూ. 75వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం రూ. 75వేలు ఆలయ కమిటి సభ్యులకు దాత అందజేశారు. ఆలయానికి విరాళం అందించిన దంపతులను ఆలయ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశాఖ గంగారెడ్డి, ఆలయ కమిటి సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అమెరికాలోని అట్లాంటాలో భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అట్లాంటాలో ఉగాది, శ్రీరామ నవమి పండుగ సందర్భంగా భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని బోధన్ పట్టణానికి చెందిన సభ్యులు దైవజ్ఞాన ప్రచారంలో భాగంగా భగవద్గీత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వారి కోసం భగవద్గీత బుక్‌స్టాల్ ఏర్పాటు చేశారు. అమెరికాలో ఉన్న తెలుగు వారు భగవద్గీత పుస్తకాలు లభ్యమవ్వడంతో అక్కడ ఉన్న తెలుగువారు సంతోషం వ్యక్తం చేశారు. ఆమెరికాతో పాటు వివిధ దేశాలలో బోధన్ పట్టణానికి చెందిన సభ్యులు దైవజ్ఞాన ప్రచారంలో భాగంగా భగవద్గీత బుక్‌స్టాల్‌ను నిర్వహిస్తుంటారు. బోధన్ వాసులు వారిని అభినందిస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):నిత్యం యోగ చేయడం వల్ల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పతాంజలి యోగ సమితి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షురాలు మంజుశ్రీ అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని ఎస్ఎస్‌కే భవన్‌లో మహిళ పతాంజలి యోగ సమితి ఆరోగ్య సభ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత ఆరోగ్య సలహాలు యోగాలో మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక లాభాలను పొందడానికి చేయాల్సిన మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు ఖాందేష్ సంగీత, సునీత జైరాజ్, గట్టడి స్వాతి, బోజ్‌కర్ వీణ, కమల, లక్ష్మీ, మంజుల, ప్రేమ, సరస్వతి పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ పట్టివేత

నవీపేట,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం శివారులో ఆదివారం అక్రమంగా మొరం తరలిస్తున్న ఒక జేసీబీ, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు సంబంధిత వాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్ తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు వాహనాల యాజమాని సూర నర్సయ్య, డ్రైవర్లు షేక్ జునైద్ ఖాన్, నగేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



రుద్రూరులో అంబేద్కర్ విగ్రహాన్ని కడుగుతున్న బీజేపీ నాయకులు



అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో ఆదివారం గావ్ చలో, బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం అంగడి బజార్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని కడిగారు. రుద్రూరు గోశాలలోని గోవులను శుభ్రం చేసి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రశాంత్ గౌడ్, హరికృష్ణ, సాయన్న, రాజు, కృష్ణం రాజు, రాజారాం, శంకర్, మురళి, శ్రీనివాస్, గంగాధర్, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో గావ్/బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామంలోని దళితవాడలో ఊరేగింపుగా వెళ్లి కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దళితవాడలో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కందగట్ల రాంచందర్, కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గెంటె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, దళిత మోర్చా కన్వీనర్ కోటేష్, యువమోర్చా కన్వీనర్ సాయి,బూత్ అధ్యక్షులు, నాయకులు తదితరులున్నారు.

సమస్యల వలయంలో భీమ్‌గల్ పట్టణం : ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

భీమ్‌గల్,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో గతంలో నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే విధంగా ఉన్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా భీమ్‌గల్ పట్టణంలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాథం చెరువు మినీ ట్యాంక్ బండ్ చేస్తామని మాజీ మంత్రి రూ. 6 కోట్లు పై చిలుకు నిధులు మంజూరు చేయించి నాసిరకం పనులు చేసి డబ్బులు మొత్తం కాజేసినారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మండల ప్రజలకు ఆర్టీసీ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పి విస్మరించాడని, సమీకృత మార్కెట్, వంద పడకల ఆసుపత్రి పనులు మధ్యలో నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా వాటిని పరిష్కరించడంలో విఫలమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ పట్టణ అధ్యక్షుడు మధు, మాజీ ఎంపీటీసీ ఆరే రవీందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, పట్టణ కిషన్ మోర్చా అధ్యక్షుడు నీలం గంగాధర్, ఎస్టీ మోర్చా మండల ఉపాధ్యక్షుడు రమావతు వెంకటేష్, భీమ్‌గల్ సర్వసమాజ్ కమిటీ కోశాధికారి కాపు కుమ్మరి హరీష్, సీనియర్ నాయకులు సంధ్య, రాజు, పీరీ గంగాధర్, చిన్ని నర్సయ్య, ముచ్కుర్ కూరు ప్రసాద్, జైగురు ప్రసాద్, గోపారం సురేందర్, తోపారం నరేంధర్, నరేందర్ గౌడ్, నవీన్, తక్కురి అంజయ్య, కంఠం శేఖర్, నామాల వెంకటేష్, దర్శన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ము.. ప్రైవేటు పాలు

● డిచ్‌పల్లిలో చేపల విక్రయించే స్టాల్‌లో పండ్ల రసాల దుకాణం ● పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

డిచ్‌పల్లి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లిలో చేపల మార్కెట్ నిర్మాణ పనుల ప్రారంభ సమయంలో తీసుకొచ్చి ఇక్కడ ఉంచిన చేపలు విక్రయించే స్టాల్ ఇక్కడి నుంచి తరలించి ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డి పల్లి స్వాగత తోరణం వద్ద ఓ వ్యాపారి పండ్ల రసాల దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. మత్స్యశాఖ కి చెందిన ఈ స్టాల్ ని గతంలో హైదరాబాద్ నుంచి డిచ్‌పల్లి తీసుకొచ్చి ఉంచారు. గత 2ఏళ్లు గా వృథగా పడి ఉన్న ఈ స్టాల్ ను తరలించి పండ్ల రసాల దుకాణానికి ఇవ్వడంతో మత్స్యశాఖ అధికారులపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చేపలు విక్రయించే ఈ స్టాల్‌కు రంగులు వేసి దాని రూపురేఖలు మార్చివే యడం కొసమెరుపు. డిచ్‌పల్లిలో చేపల మార్కెట్ పనులు ప్రారంభం గాకముందే ఈ స్టాల్ ను ఇతర వ్యాపారస్థులు ప్రైవేట్ వాళ్లకు అప్పజెప్ప డంతో అధికారులపై గుసగుసలు వినబడుతున్నాయి. ఈ విషయమై మత్స్యశాఖ జిల్లా ఏడీఆంజ నేయులను వివరణ కోరగా స్టాల్ మత్స్యశాఖ కు చెందినది కానీ దానిని ఏ వ్యాపారానికి అయిన వాడుకొవచ్చని చెప్పడం గమన్హారం.



చేపల విక్రయించే స్టాల్ లో ఎల్లారెడ్డి పల్లి వద్ద ఏర్పాటు చేసుకున్న పండ్ల రసం దుకాణం

బషీరాబాద్‌లో గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 13: (ఆంధ్రజ్యోతి)మండలంలోని బషీరాబాద్ కాడిచెరువులో కొలువుదీరి ఉన్న గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభమయ్యాయి. ఏప్రెల్ నెల 13నుండి 17 వరలకు నిర్వహింపబడే గంగమ్మ ఆలయ వార్షి కోత్సవంలో భాగంగా తొలి రోజు ఆదివారం గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు వలగొడుగు ఉత్సవాన్ని నిర్వహిస్తు ఉత్సవ మూర్తులను గ్రామం నుండి కాడిచెరువులోని గంగమ్మ గుడికి చేర్చారు. ఆలయ అర్చకులు జగదంబాదేవి ఉపాసకులు మంత్రాజ్యం కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సుంకెట నారాయణ, ఉపాధ్యక్షులు మోతే రవిందర్ సంఘ సభ్యులు గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.14 న స్థాపిత దేవతా హోమాలు, కళశ పూజ 15 న రుద్రహోమం, మహాచండీ యాగం, కుంకుమార్చన16 న గంగామాత మహాభిషేకం, అలంకరణ, నైవేద్యహారతి, శివపార్వతి గంగామాత కల్యాణం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గంగామాతకు కాడిచెరువులో చక్రస్నానం పల్లకి ఊరేగింపు, 17న మాల విరమణ తదితర కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కవాలని ఉత్సవ నిర్వహకులు కోరారు.



బషీరాబాద్‌లో వలగడుగు ఉత్సవం నిర్వహిస్తున్న గంగపుత్ర సభ్యులు

బీజేపీ కార్యకర్తకు పరామర్శ

మెండోర,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):మండలంలో సావెల్ గ్రామంలో భార తీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ ను భారతీయ జనతా పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఇటీవల కొలిపాక శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మల్లికార్జున్‌రెడ్డి ఆయన నివాసా నికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.ఆయన వెంట బీజేపీ నాయకులు నిమ్మల శ్రీనివాస్, మారముత్యంరెడ్డి, తదితరులు ఉన్నారు.

సులేమాన్ నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోటగిరి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని సులేమాన్ నగర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ ఖాదర్ ప్రారంభించారు. కోటగిరి, రుద్రూరు ప్రధాన రహదారి నుంచి బసవేశ్వర మందిర వరకు సుమారు రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్ రావు దేశాయ్, నారాయణ రావు, లతీఫ్, దస్తాగిరి, ఖాదర్, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కోటగిరి,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని క్యాన్సర్ వ్యాధితో బాదపడుతున్న చిన్నారి కుటుంబానికి ఆదివారం బాన్సువాడ నియోజకవర్గ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ 5వేల రూపాయల ఆర్థిక సహయం అందజేశారు. గ్రామానికి చెందిన చింతల రాజు, రేణుక దంపతుల రెండేళ్ల కూతురు మహన్విత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఎన్ఆర్ఐ తన ట్రస్టు ద్వారా 5వేల రూపాయల ఆర్థిక సహయంతో పాటు నెలవారి మందులకు ఆర్థిక సహయం అందిస్తానని భరోసి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మండల అధ్యక్షులు హరికృష్ణ, సీనియర్ నాయకులు కటికె రాజారాం, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

అమీనాపూర్ చర్చిలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

వేల్పూర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో ఆదివారం మన్నా చర్చిలో పాస్టర్ జాన్‌విల్సన్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. యేసుక్రీస్తు భక్తి పాటలు , నృత్యాలతో దేవున్ని ఆరాధించారు. అనంతరం గాడిద పిల్లగ ఉండి మీద కూర్చొని యేసుక్రీస్తును మందిరం చుట్టు తిప్పి చర్చిలోకి ఆహ్వానించారు. అనంతరం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా పాస్టర్ జాన్ విల్సన్ క్రీస్తు యొక్క బోధనను వివరించారు.

సిరికొండలో అంబేడ్కర్ విగ్రహం శుద్ధి

సిరికొండలో గావ్ చలో - బస్తీ చలో కార్యక్రమం విజయవంతం

సిరికొండ ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు సిరికొండ మండల కేంద్రంలో ఆదివారం గావ్ చలో - బస్తీ చలో కార్యక్ర మాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. సిరికొండ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ .అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి రంజిత్‌రెడ్డి, యువమోర్చ మండల అధ్యక్షుడు మధు,జిల్లా కార్యద ర్శి రాజేశ్వర్. జిల్లా నాయకులు రాజేశ్వర్‌రెడ్డి,కిసాన్‌మోర్చమండల అధ్యక్షులు ప్రభాకర్, గంగారెడ్డి, మారుతి,అజయ్,కిరణ్,శ్రీనివాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో అన్నదానం

వర్ని,ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో ఆదివారం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో మండల పరిసరాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రావుట్లలో చలివేంద్రం ప్రారంభం

సిరికొండ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పార్టీ నేతలు ఆదివారం ప్రారంభించారు. పాత గ్రామ పంచాయతీ వద్ద బస్టాండ్‌లో ప్రయాణికులకు వేసవిలో దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు దామోదర్ చెప్పారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్,బాబన్న,జమున,శ్యామల,డాక్టర్ గోపాల్,వీడీసీ చైర్మన్ కొడిగెల నందు గంగాదాస్,మోతిలాల్,కాంగ్రెస్ నాయకులు రమేష్ గౌడ్,సామెల్,రాజేశ్వర్ తదితరులు పాల్గోన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జాన్కంపేట్‌లో చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు జక్రాన్‌పల్లిలో 9మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన బనవత్ ఈరబాయి రూ.25వేల 500లు, జైడి మల్లు బాయికి రూ.13వేల 500లు, హర్షయాఫీర్ దోస్త్‌కు రూ.28వేలు, ధనుంజయ్‌కి రూ. 60వేలు, రత్నాల శేఖర్‌రావుకు రూ. 12వేలు, పడకంటి శ్రీజకు రూ 20వేలు, ముస్కు గంగ నర్సుకు రూ. 24 వేలు, తొగరి రాములుకు రూ. 18వేలు, మలావత్ రాముకు రూ. 26 వేలు సీఎంఆర్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, మండల మైనార్టీ అధ్యక్షుడు అక్బర్, మాజీవైస్‌ఎంపీపీ జితేందర్ నాయక్, నట్ట తిరుపతి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

వేల్పూర్: మండలం జాన్కంపేట్ గ్రామంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనీల్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యంతో పేదలు ఆసుపత్రిలో చికిత్స ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం వరం లాంటిదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ గౌడ్ అన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, అందుకు సహకరించిన బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్,కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శెట్టివినోద్, సౌడ శ్రీనివాస్, జేమ్స్ గంగారెడ్డి, రంఘుకిశోర్‌గౌడ్, జీజీ గంగారెడ్డి, నర్సారెడ్డి, అరుణ్‌రాజ్, జైరాజ్ పాల్గొన్నారు.

● వాడి గ్రామంలో..

మండలంలోని వాడి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం నర్సారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాలలో 45 మంది లబ్ధిదారులకు గాను రూ. 12 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఐదుగురి లబ్ధిదారులకు మంజూరీ అయిన చెక్కులను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న వారికి బాల్కొండ నియోకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునిల్ కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరీ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం జీవన్, ముస్కు మోహన్, బద్ధం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, దండెవోయిన సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

15న డిచ్‌పల్లిలో రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం : మాజీ జడ్పీటీసీ



డిచ్‌పల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం కోసం ఈ నెల 15న సాయంత్రం 4గంటలకు డిచ్‌పల్లి గాంధీనగర్ శివారులో గల జీ కన్వెన్షన్ లో నిజామాబాద్ రూరల్ నియోజక వర్గ స్థాయి బీఆర ఎస్ కార్యకర్తలు, నాయకుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. ఆదివారం ఆయన డిచ్‌పల్లిలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కవిత,మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌లు హాజరువుతున్నారని జగన్ తెలిపారు. కావున నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు క్రిష్ణ, పద్మరావు, సాయిలు, ఒడ్డం నర్సయ్య, సుధం నాయక్, పాల్గొన్నారు.

పలువురి మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

వేల్పూర్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం కుకునూర్, వాడి గ్రామాలలో ఇటీవల అనారోగ్యంతో మరణించి రెండు కుటుంబాలను ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. కుకునూర్ గ్రామానికి చెందిన శ్యాంయాదవ్ వాళ్ల తాత మల్కన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. అలాగే వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మహేందర్ వాళ్ల మామ నడ్పి బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సునీల్‌రెడ్డి ఆదివారం వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించి , ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి

ఇందల్వాయి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన దూస సంతోష్‌కు కిడ్నీ ఆపరేషన్ కోసం 5లక్షల ఎల్‌వోసి పత్రాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. కిడ్నీ ఆపరేషన్ నిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్‌లో చేయించుకునే సమయంలో పేద కుటుంబం కావడంతో అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మెండె అశోక్, సంతోష్ ఆరోగ్య పరిస్థితిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే ఎమ్మెల్యే స్పందించి 5లక్షల ఎల్‌వోసి పత్రాన్ని అందజేశారు. ఎల్‌వోసి ఇప్పించడానికి కృషి చేసిన మెండో అశోక్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవీపేటలో ప్లాస్టిక్ రహిత వివాహం

● సంప్రదాయ పద్ధతిలో భోజనాల వడ్డింపు ● వివాహాన్ని ఆదర్శంగా జరిపించడం పట్ల అతిథుల ప్రశంసలు

నవీపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ప్లాస్టిక్ రహిత వివాహం జరిగింది. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ఫోటో స్టూడియో యజమాని నాంపల్లి వసంత్ కుమార్, ఉమాదేవి దంపతులు తమ కూతురు అనూహ్య వివాహాన్ని బీదర్‌కు చెందిన పవన్‌తో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివాహం జరిపించారు. ఇటీవల కాలంలో జరుగుతున్న వివాహాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుండగా దానికి భిన్నంగా ప్లాస్టిక్ రహిత వివాహాన్ని జరిపించడం విశేషం. ఫంక్షన్ హాల్‌లో గేటు బయట ప్లాస్టిక్ ఫ్లెక్సీకి బదులుగా బట్టపై కళాకారుడితో నూతన వధూవరుల పేర్లను రాయించారు. గేటు లోపల బట్టపైన డిజైన్ చిత్రాలతో ఉన్న స్వాగత తోరణాన్ని ఏర్పాటు చేశారు. పెళ్లి పందిరిలో కొబ్బరి కొమ్మలు, సహజసిద్ధంగా పూసిన పూలతో డెకరేషన్ చేశారు. భోజనాల వద్ద సుమారు 2వేల మంది అతిథులకు కుర్చీలు, బెంచీలను ఏర్పాటు చేసి మోదుగ ఆకుతో తయారు చేసిన విస్తారాకులలో వివిధ రకాల వంటకాలను వడ్డించారు. తాగునీటి కోసం ప్లాస్టిక్ గ్లాసులు కాకుండా స్టీల్ గ్లాసులను ఏర్పాటు చేశారు. ఫ్రూట్ సలాడ్‌లను మోదుగ ఆకుతో తయారు చేసిన దొనేలలో అందించారు. భోజన శాలలో గోడలపై ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే నష్టాల గురించి చార్ట్‌లపై రాసి ప్రదర్శించారు. ప్లాస్టిక్ వస్తువులలో తినడం గాని తాగడం గాని చేయవద్దని దీని ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని ప్లాస్టిక్ వినియోగంతో ఆరోగ్యానికి హానికరంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందని అందులో వివరించారు. ప్లాస్టిక్ వినియోగించకుండా సంప్రదాయ పద్ధతిలో తన కుమార్తె వివాహాన్ని జరిపించిన నాంపల్లి వసంత్ కుమార్, ఉమాదేవి దంపతులను పెళ్లికి వచ్చిన అతిథులు అభినందించారు. ఈ వివాహాన్ని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరింత మంది ఈ పద్ధతిని ప్రతి ఒక్కరు పాటించినట్లయితే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడిన వారు అవుతామని పలువురు పేర్కొన్నారు.


నవీపేటలో సంప్రదాయబద్ధంగా వేసిన పెళ్లి మండపం



ఫ్లెక్సీ బదులు బట్టపైన కళాకారుడితో రాయించిన వివాహ ఆహ్వానం



బట్టపైన రాసిన భారతీయ కల్యాణ సంస్కృతి


సంప్రదాయ పద్ధతిలో టెబుళ్లు, కుర్చీలు వేసి విస్తరాకుల్లో భోజనం వడిస్తున్న దృశ్యం


సంప్రదాయ పద్ధతిలో టేబుళ్లు, కుర్చీలు వేసి విస్తారాకుల్లో భోజనం వండిస్తున్న దృశ్యం

ప్రమాదకరంగా మారిన రహదారి

● ఆదమరిస్తే అంతే సంగతి


కొత్తపల్లి- ముప్కాల్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా మారిన కల్వర్టు


ప్రమాదకరంగా మారిన మూలమలుపు

ముప్కాల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ నుంచి కొత్తపల్లి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ముప్కాల్ నుంచి కొత్తపల్లి వెళ్లే దారిలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో మూలమలుపు వద్ద పురాతన కల్వర్టు శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో వాహనదారులు అజాగ్రత్తగా నడిపిన ఆదమరిస్తే అంతే సంగతి. ఈ రోడ్డుపై మరమ్మతులు జరిపి డబుల్ తారురోడ్డుగా మార్చారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాల్సి ఉండగా, నిర్మించక పోవడంతో ఇప్పుడు అదే కల్వర్టు కూలిపోయి వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదు. ముప్కాల్ శివారులో జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో హైవేపైకి వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ఇదే రోడ్డుపై నిత్యం అనేక వాహనాలు వెళ్తుండడంతో తారు రోడ్డు ధ్వంసమైంది. ఇదే స్థలంలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులకు ప్రయాణం కష్టంగా మారింది. సంబంధిత అధికారులు ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకొని కల్వర్టు నిర్మించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెలుగునివ్వని హైమాస్ట్ లైట్లు

•చీకటిమయంగా చౌరస్తా • కన్నెత్తి చూడని అధికారులు

మహమ్మద్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తాలో ఉన్న హైమాస్ట్ లైటు రోజుల తరబడి వెలగకపోవడంతో ఆ ప్రాంత మంతా చీకటి మయంగా మారుతుంది. నిజాంసాగర్-కామారెడ్డి, బాన్సువాడ- ఎల్లారెడ్డి, బాన్సువాడ - నిజాంసాగర్‌కు వెళ్లెందుకు ప్రజలు వేచి ఉండడంతో ఈ ప్రాంతమంతా నిత్యం రద్దీగా ఉంటుంది. రాత్రి వరకు ఈ ప్రాంతం గుండానే ప్రజలు ప్రయాణాలు సాగిస్తుంటారు. కాని ఈ ప్రాంతమంతా చీకటిమయంగా మారడంతో భిక్కుభిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. హసన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ వీధిలైట్లు చెడిపోయి 15 రోజులు కావస్తున్న ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని ప్రయాణికులు ఆవేదన చెందు తున్నారు. రాత్రివేళలో అగంతకులు విచ్చలవిడిగా మద్యం తాగుతూ రోడ్లపై సంచరిస్తుండడంతో చీకటిగా ఉన్న ప్రాంతంలో ఉండలేని మహిళలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన చౌరస్తాలోనే ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉంటే ఇక గ్రామాల్లోని వీధి లైట్ల పరిస్థితి ఏమిటనేది అర్థంచేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చౌరస్తాలో హైమాస్ట్ లైట్ల మరమ్మతులు చేయించి ప్రజలకు వెలుగులు పంచేలా కృషి చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.


బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద ఉన్న హైమాస్ట్ లైట్లు

ఎండిన చెట్టు కింద సేద తీరుతున్న పాడి గేదెలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం కోమన్ పల్లి శివారులోని గోదావరి తీరానికి మేతకు వెళ్లిన పాడి గేదెలు ఎండ వేడిమి నుంచి సేద తీరేందుకు పచ్చని చెట్లు లేకపోవడంతో ఎండిన మోడు కిందనే సేద తీరుతున్న దృశ్యం.


ఎండిన మోడు కింద సేదతీరుతున్న పాడి గేదెలు

రసవత్తరంగా కుస్తీ పోటీలు


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు


కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

వర్ని, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం పాత వర్ని గ్రామంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. చివరి కుస్తీ వీరుడికి 1001రూపాయలు నగదు అందజేశారు. కుస్తీ పోటీల్లో ఉమ్మడి జిల్లాలతో పాటు మహరాష్ట్ర నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ ఏడాది హనుమాన్ జయంతి సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తారు.

లక్ష్మాపూర్‌లో..

మోస్రా: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో అదే విధంగా మోస్రా మండల కేంద్రంలో గ్రామ కమిటీల ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొనేందుకు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి మల్లయోధులు పోటాపోటీగా తలపడ్డారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు వెండి కడియం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బిల్లా పోతారెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, చుట్టూ మండలాల, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉమ్మడి వర్ని మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదక్‌పల్లిలో..

మోపాల్: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ముదక్ పల్లి గ్రామంలో ఆదివారం సూదులమ్మ ఆలయం వద్ద కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రథోత్సవం, జాతర నిర్వహించారు. ప్రతీ సంవత్సరం హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామంలో కుస్తీ పోటీలను నిర్వ హించడం ఆన వాయితీగా వస్తుందని తెలిపారు. ఈ కుస్తీ పోటీలో మోపాల్ మం డలం కుస్తీవీరులే కాకుండా మహారాష్ట్ర నుంచి పోటీ దారులు వచ్చి పోటీలో పాల్గొంటారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి వెండి కడియం, నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, వీడీసీ పెద్దలు పాల్గొన్నారు.

కల్వర్టుపై గుంతను పూడ్చండి సారూ


కల్వర్టుపై ఏర్పడిన గుంత

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని 35వ వార్డులో డ్యామేజ్ అయిన కల్వర్టు పనులను ఒకసారి చూడండి సారూ అని కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు. గతవారం రోజుల క్రితం ప్రధాన రోడ్డుకు మధ్యన కల్వర్టు కూలిపోవడంతో రంధ్రం ఏర్పడింది. అటువైపు వెళ్తున్నా వాహనదారులకు రంధ్రం ఏర్పడక వాహనాల టైర్లు ఇరుక్కుపోయి నానా అవస్థలు పడుతున్నారు. దీన్ని గమనించిన కాలనీ వాసులు డ్యామేజ్ అయిన కల్వర్టు రంధ్రంలో చెట్టు కొమ్మను పెట్టారు. అధికారులు రంధ్రాన్ని పూడ్చి కల్వర్టునీ బాగు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఘనంగా ఆదినాథ స్వామి దేవాలయం జాతర

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జక్రాన్ పల్లిలో శనివారం అర్ధరాత్రి ఆదినాథ స్వామి దేవాలయం జాతర, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి రథోత్సవాన్ని భక్తులు లాగి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు యజ్ఞ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్స వాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. రథోత్సవాన్ని భక్తులు లాగి ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం స్వామివారి చక్రతీర్థం జరిగింది. సోమవారం స్వామివారి నాగవెళ్లి జరగనుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సా రెడ్డి, బాలకిషన్, వసంత్‌రావు, జితెందర్‌నాయక్, వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.


ఆధినాథ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, నాయకులు

ఫొటో న్యూస్


కమ్మర్‌పల్లి జాతీయ రహదారి నుంచి తిమ్మాపూర్ వెళ్లే రహదారికి కనిపించని బోర్డు


గ్రామ బోర్డులేని చౌట్‌పల్లి, హసాకొత్తూర్ గ్రామాల మధ్య నుంచి వడ్యాట్ వెళ్లే రహదారి

ఏదారెటుపోతుందో ఎవరికీ ఎరుక

• దారుల వద్ద గ్రామాల బోర్డులు లేక వాహనదారుల తికమక

జాతీయ రహదారులు మొదలుకొని ప్రతీ గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రహదారుల వద్ద ఆయా గ్రామాల పేర్లు.. ఆ గ్రామాల దూరం కిలోమీటర్లు ఉండేవి.. వాటి ఆధారంగానే ప్రయాణికులు వాహనదారులు ఆయా గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. కానీ ఈ మధ్య వాటి విషయం సంబంధిత ఆర్ అండ్‌బీ గాని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జాతీయ రహదారి సంబంధిత అధికారులు వాటి ఏర్పాట్లను మరిచిపోవడంతో అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొందరైతే గ్రామాల సూచిక బోర్డు లేక ఎక్కువ దూరం ప్రయాణం సాగించి తిరిగి వెనక్కిరావలసిన పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారుల ఇప్పటికైనా స్పందించి గ్రామాలకు వెళ్లే దారుల వద్ద ఆయా గ్రామాల పేర్లు వాటి దూరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

• (ఆంధ్రజ్యోతి, కమ్మర్‌పల్లి)


జాతీయ రహదారి నుంచి నాగాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిపై కనిపించని బోర్డు

21వ ప్యాకేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో అనేక రైతాంగ పోరాటాల ఫలితంగా గోదావరి నదిపై అలీసాగర్, గుప్త ప్రాజెక్టులను నిర్మించుకోవడం జరిగిందని దీంతో పాటు మంచిప్ప చెరువుపై 21వ ప్యాకేజీ పనులను కూడా ప్రారంభించి నిలిపివేశారని వెంటనే పనులను ప్రారంభించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి తాగునీరు అందించేందుకు 21వ ప్యాకేజీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గత రెండేళ్లుగా పనులు నిలిపివేశారని కావున వెంటనే ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో వేల్పూర్ భూమయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం


సమీక్షలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి, షబ్బీర్ అలీ, మహేష్‌కుమార్‌గౌడ్, భూపతిరెడ్డి, తదితరులు

నిజామాబాద్అర్బన్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని జలసౌదాలో ఆదివారం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం, నిజామాబాద్‌రూరల్‌నియోజకవర్గంలో వివిధ నీటిపారుదలశాఖ ప్రతిపాధనలపై మం త్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లాఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీమహేష్‌కుమార్‌గౌడ్,ప్రభుత్వసలహా దారు షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు, ఇతర అధికారులు సమీక్ష నిర్వహించారు. మంచిప్ప చెరువును పాత డిజైన్ ప్రకారమే అభివృద్ధి చేసి లక్షా 82వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్న ట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా రూ రల్ నియోజకవర్గంలో పలు నీటిపారుదల శాఖ ప్రతిపాధనలపై సానుకూలంగా నిర్ణ యాలు తీసుకున్నారు. ప్రాణహిత చేవెళ్ల ప నులను త్వరితగతిన పూర్తిచేసేలా మంత్రులు అధికారులతో సమీక్షించారు.ఈసమీక్షలో నీటి పారుదల ప్రభుత్వ సలహాదారు ఆధిత్యానాథ్ దాస్, నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఆదివారంమధ్యాహ్నం హైదరాబాద్ లోని జల సౌధలో ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం నిజామాబాద్ రూరల్ లో వివిధ నీటిపారుదల నిర్మాణాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జుపల్లి కృష్ణ రావు సమక్షంలో భారీ నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి పాల్గొని పలు అంశాను అధి కారుల దృష్టికి తీసుకొచ్చారు మంచిప్ప చెరు వును పాత డిజైన్ ప్రకారం అభివృద్ధి చేసిరెండెళ్లలో 1.82లక్షలఎకార లకు సాగునీరు అందించేల చర్యలు తీసు కుంటామని నియోజకవర్గంలో అన్ని చిన్న నీటి పారుదల పనులపై చర్చించి సానూకు లనమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ, ఆదిత్యనాథ్ దాస్, ప్రశాంత్ పాటిల్ ఈఎన్సీలు, సీఈలు, ఎసీఈలు పాల్గొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వేసవి శిబిరం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా విద్యార్థినిలకు ఉచితంగా వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి మే 2వ తేదీ వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వేసవి శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్మూర్ రోడ్‌లోని ఆర్‌టీవీఆర్‌ఆర్ పాఠశాలలో విద్యార్థినిలు తమను తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మ సంరక్షణ), భవిష్యత్తు నిర్మించుకోవడానికి మోటివేషన్ (ప్రేరణ), సమాజంలో మహిళలపై జరిగే నేరాల పట్ల పోలీసు తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. 9, 10, ఇంటర్మీడియేట్ విద్యార్థినిలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చని ఉదయం అల్పాహారం ఉచితంగా అందజేయడం జరుగుతుందని సీపీ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేర్లను ఈనెల 13 నుంచి 24 తేదీ వరకు 9000994312 నెంబర్‌ను సంప్రదించాలని అన్నారు. ఈ అవకాశాన్ని నగరంలోని విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పూర్వ పీడీఎస్‌యు నాయకులు, సీనియర్ న్యాయవాది పరుచూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఎన్ఆర్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ విదేశాల్లో విద్యను ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తుంటే మన దేశంలో మాత్రం విద్యా వ్యాపారం అయ్యిందన్నారు. విద్యాభివృద్ధికి కొటారి కమీషన్ కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని సూచిస్తే కేంద్రం 2 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులను కేటాయించడం శోచనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణను చేయాలని చూస్తున్నాయని అన్నారు.ఈ సమావేశంలో మాజీ పీడీఎస్‌యు నాయకులు రమేష్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌతం, జన్నారపు రాజేశ్వర్, ప్రిన్స్, దేవిక, మనోజ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రమణ మృతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడురమణ ఆదివారం మృతి చెందారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం మృతి చెందారు. ఆయన జిల్లాలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. గుండారం ప్రాథమిక పాఠశాలలో 2020లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మృతి పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలయ్య, ఓమాజీ, తదితరులు తమ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన ఉపాధ్యాయ ఉద్యమంలో చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.

వర్తమాన సమాజానికి అంబేద్కర్ ఆలోచనలే పరిష్కారాలు


జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వీసీ యాదగిరి

డిచ్‌పల్లి,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం 21వ శతాబ్ధంలో డా.బీఆర్ అంబేద్కర్ ఔచిత్యం అనే అంశంపై వర్సిటీలో ఎస్సీ సెల్ డైరెక్టర్ డా.వాణి ఆధ్వర్యంలో వెబినార్ వేదికగా సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల ఈ వెబ్‌నార్ ను సమన్వయ పరిచారు. ఈ సందర్భంగా వీసీయాదగిరి రావు మాట్లాడుతూ.. డా. బీఆర్ అంబేద్కర్ భారతదేశాన్ని కేవలం రాజకీయంగానేగాకుండా సామా జికంగా, ప్రజాస్వామ్యంగా మార్చాలనే లక్ష్యంతో అత్యుత్తమ రాజ్యంగం రూపొందించరన్నారు. వర్తమాన సమాజంలో డా.అంబేద్కర్ ఆలోచనల ఆచరన అనుసరనీయమన్నారు. అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ... భారత రాజ్యంగం, అంబేద్కర్‌ను వేర్వేరుగా చూడలేమన్నారు. విశాల భారత దేశానికి గొప్ప ధృడ రాజ్యాంగం అందించిన ఘనత అంబేద్కర్ అని కొని యడారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుకుమార్ మాట్లాడుతూ...ఆధునిక భారత్‌లో రాజ్యంగం ప్రాము ఖ్యత గురించి వివరించారు 75ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో రాజ్యాంగం అనేకమలు పులు జరిగయన్నారు.ఈకార్యక్రమంలో డీన్‌లు గంట చంద్రశేఖర్, రాంబాబు, డైరెక్టర్ పున్నయ్య,నాగరాజు, ఎల్లోసా, ప్రసన్నరాణి, డా.సంపత్ పాల్గొన్నారు.

భానుడి భగభగలు..

● జిల్లాలో ఆదివారం 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు
● 29 ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఆదివారం భాను డు తన ప్రతాపాన్ని చూపాడు. ఏప్రిల్ నెల మొదటి వారంలోనే జిల్లాలో గరి ష్ట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. ఆదివారం ఆలూర్ మం డలం మచ్చర్ల గ్రామంలో 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా మెండోరాలో 42.7, వేంపల్లిలో 42.6, కోటగిరిలో 42.3, మంచిప్పలో 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ వేసవి కాలంలో 42 డిగ్రీల గరిష్ట ఉష్ణో గ్రతలు నమోదు కావడం ఇదే మొదటి సారి. జిల్లా వ్యాప్తంగా 29 ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ నమోదైంది. ఈ ప్రాంతాలలో 40 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఒక్కసారిగా గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11గం టలు దాటితే రోడ్లన్నీ నిర్మాణుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 5గంటల వరకు ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి బొండాలు, కూల్‌డ్రింక్‌లు ఇతరత్ర శీతల పానియాలను సేవిస్తున్నారు. ఇళ్లలో చల్లనీటి కొరకు రంజన్‌లను కొనుగోలు చేస్తున్నారు. ఉక్కపోత నుంచి ఉపశ మనం పొందేందుకు కూలర్లు, ఏసీల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

ఘనంగా ఇంటింటా విష్ణు సహస్ర పారాయణం

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):నగరంలోని శివాజీనగర్ లోగల గీతాభవన్‌లో ఆదివారం ఇంటింటా పారాయణం ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని విష్ణుసహస్రనామ పారాయణం, భజనలు, భక్తిగీతాలు ఆలపించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తిపాటలు పాడిన పలువురిని గీతాభవన్ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిషన్, రమేష్, జ్యోతి, రాజ్‌కుమార్, నాగరాజు, ధర్మేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలి

● ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ధర్పల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.కుమారస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని సీతాయిపేట గ్రామంలో ఈనెల 7న ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, మూఢనమ్మ కాలపై అవగాహన, పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత, పిచ్చిమొక్కలను తొలగించడం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ప్రత్యేక అధికారి కుమారస్వామి మాట్లా డుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను, సేవాభావం అలవర్చుకోవాలన్నారు. గ్రామం లో విద్యార్థులు గ్రామస్తులను జాగృతం చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని మూఢనమ్మ కాలపై అవగాహన కల్పించాలని అవినీతిపై నిలదీయాలని అన్నారు. విద్యార్థులు సేవాభావంతో భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు సాగా లని సూచించారు. ఈ కార్యక్ర మంలో బోటనీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడి రవిరాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో సర్టిఫికెట్‌లను అందజేసిన దృశ్యం

జిల్లా ఆర్చరీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ఆర్చరి సంఘం నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఆర్చరి అసోసియేషన్ అధ్యక్షుడిగా ఈగసంజీవ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రం లోని సంజీవ్‌రెడ్డినగర్‌లో ఆదివారం ఆర్చరి అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలకు గంట ప్రవీణ్‌కుమార్ ఎన్నికల అధి కారిగా వ్యవహరించారు. అన్ని పదవులకు ఒకే నామినేషన్ నమోదు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా ఈగసంజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోర్వ గంగరాజులు ఎన్నికయ్యారు. ఉపాధ్య క్షుడిగా ఎంటి సుబ్బారావు, కోశాధికారిగా మంతెని బాలగంగాధర్, సం యుక్త కార్యదర్శిగా ఈగ పోతన్న, సభ్యుడిగా బాదావత్ గణేష్‌లు ఎన్నికయ్యారు. వీరికి ఎంపిక ధృవపత్రాలను ఎన్నికల అధికారి అంద జేశారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్‌వర్‌గా అంద్యాల లింగన్న, డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ అబ్జర్‌వర్‌గా మీసాల ప్రశాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఈగసంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్చరీ క్రీడను జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, బోర్గాం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, గాదారి సంజీవ్‌రెడ్డి, సయ్యద్ నబీ, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని హైరాబాద్‌లో ధర్నాకు తరలిన మైనారిటీలు

లింగంపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లును వెనక్కి తీసుకోవాలని మైనా రిటీలు హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు లింగంపేట మండలానికి చెందిన మైనారి టీలు ఆదివారం తరలి వెళ్లారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్‌పార్టీ మాజి మైనారిటీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫతియోద్దీన్ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీల పట్ల చిన్నచూపు చూస్తుందని వక్ఫ్ బిల్లును ప్రభు త్వం వెంటనే వనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారి లో హర్షద్, సాదిక్, గురు పాషా, రషీద్‌లతో పాటు మైనారిటీలు ఉన్నారు.

నేడు తాడ్వాయిలో మెగా రక్తదానశిబిరం

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఐఏఎఫ్ సేవాదళ్ రాష్ట్రచైర్మన్ బాలు కోరారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేయడం జరిగిందని రక్తదాతలు పెద్ద సంఖ్యలో విచ్చేసి రక్తదానం చేసి చిన్నారుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు రక్తదానశిభిరం కొనసాగుతుందని మిగిలిన వివరాలకు 9492874006 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న దృశ్యం

ఇందల్వాయి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):పేద కుటుంబాల్లో పుట్టి అనారోగ్యానికి గురైతే ఆసుపత్రుల్లో అత్యవసర ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ పేదల కళ్లల్లో ఆనందం చూడటం కోసమే ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నల్లవెల్లి, ఎల్లారెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నల్లవెల్లిలో ఆరుగురికి 2లక్షల 19వేల రూపాయలు, ఎల్లారెడ్డిపల్లిలో ఐదుగురికి 1లక్ష 86వేల రూపాయల చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామ సుమన్, నీరడి మనోహర్, నీరడి నవీన్, రవి, రోహిత్‌రెడ్డి, గంగాధర్, డీసీసీ డెలిగేట్ తలారి సుధాకర్, కర్నమోహన్, ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాల సమయాన్ని తగ్గించేలా ఎఫ్‌పీఐ ఏర్పాటు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాల సమ యాన్ని తగ్గించేలా ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్‌లను ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. 33కేవీ, 11కేవీ ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు పెడుతున్నామన్నారు. బ్రేక్‌డౌన్ సమయంలో ప్రకృతి వైపరిత్యాలు సాంకేతిక కారణాల వల్ల లైన్ మొత్తం తనిఖీ చేసే అవసరం లేకుండా విద్యుత్ అంతరాయాలు కలిగిన భాగాన్ని ఎఫ్‌పీఐ విభజిస్తుందన్నారు. దీనిద్వారా అంతరాయం ఏ భాగంలో జరిగిందనే విషయాన్ని గుర్తించి అక్కడికి సిబ్బంది వెళ్లి పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా అంతరాయాల సమయాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఎఫ్‌పీఐలు అంతరాయాల గుర్తింపు వాటి నివారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 50 విద్యుత్ ఫీడర్లలో ఎఫ్‌పీఐలను భిగించడానికి సాంకేతిక వ్యూహాత్మక ప్రదేశాలను గుర్తించామన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ఆధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తున్నా మన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1973-74 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

డిచ్‌పల్లి,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్‌లోని మానిక్‌భవన్ పాఠశాలలో 1973-74లో పదో తరగతి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం డిచ్‌పల్లిలోని ఓఫాంహౌజ్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించకున్నారు. ఈసమ్మేళన కార్యక్రమానికి 35మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నానాటి జ్ఞాప కాలు గుర్తు చేసుకొని ఆటపాటలతో అలంరించారు. ఈ కార్యక్రమానికి పలు దేశాల్లో స్థిరపడిన విద్యార్థులు రావడంతో విద్యార్థులు ఆనందపడ్డారు. ఆటపోటీల్లో గెలుపొందిన వారికి జిల్లాఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి మాజీ సొసైటీ చైర్మన్ గజ వాడ జైపాల్, నాగరాజు, అశోక్, చిరంజీవి, ఉమాపతి, చంద్రసేన్, సుబ్రమ ణ్యం, రాజేశ్వర్, యోగన్న, జనార్ధన్, యాదవ్, కృష్ణ ప్రసాద్, అప్పరావ్, కిషోర్ రఘునాథ్ స్వామి, శంకర్, రమేశ్, రామారావు, వీరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవాల్గోట్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెద్దవాల్గోట్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

సిరికొండ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో 2003-04 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులుఆదివారం సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు.కుటుంబాల మంచి చెడలను తెలుసుకున్నారు.జిల్లా పరిషత్ హైస్కూల్లో సమావేశమైన విద్యార్థులు మొదట చదువుల తల్లి సరస్వతి అమ్మవారికి పూలమాలు వేసి అలంకరించారు.ముదిరాజ్ సంఘ భవనంలో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులతో కలిసి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులను ,పూర్వ విద్యార్థులు సన్మానించి గౌరవించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన హనుమాన్ విజయయాత్ర

● ఊపిరి పీల్చుకున్న పోలీసులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన హనుమాన్ విజయయాత్ర ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం నగరంలోని కంఠేశ్వర్ నుంచి మొదలైన విజయయాత్ర నగరంలో సుమారు పది గంటల పాటు జరిగింది. వేలాది సంఖ్యలో హిందువులు ఈ ర్యాలీలో పాల్గొనగా విజయయాత్ర ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. గాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్ మీదుగా సాగిన విజయయాత్ర ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సాగడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. యాత్ర ప్రారంభం నుంచి సీపీ సాయిచైతన్య యాత్ర వెంటే ఉంటూ నిరంతరం భద్రతను పర్యవేక్షించారు. సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో యాత్ర ఆసాంతం గట్టి బందోబస్తు చర్యలను పోలీసులు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాల గుండాయాత్ర సాగిన ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా పోలీసులు వ్యవహరించారు. గతంలో హనుమాన్ శోభాయాత్రలో జరిగిన ఘటన లను పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు భద్రత ఏర్పాట్లు చేశారు. యా త్ర సాగే మార్గంలో భారీగా భారీకేడ్‌లను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. యాత్ర ముగిసే రాజరాజేంద్ర చౌరస్తా వరకు పోలీసులు ఎక్కడ కూడా అలసత్వం ప్రదర్శించకుండా పూర్తి స్థాయిలో భద్రత ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా యాత్రలో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా విజయయాత్రను జయప్రదం చేయడంలో పోలీసులు కీలకంగా వ్యవహరించారు.

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం ఏప్రిల్ 19న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు వికలాంగుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీలను విస్మరించినందుకు భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యవర్గసమావే శానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.93,700	రూ.85,500	రూ.995

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : గుడ్ బ్యాడ్ అగ్లీ (10.40, 1.35, 7.35, 10.10)
: మ్యాడ్ స్క్వేర్ (4.30)
స్క్రీన్-2 : జాక్ (10.20, 1.15, 4.10, 7.05, 10.00)
స్క్రీన్-3 : జాట్ (హిందీ) (10.00, 1.10, 4.20, 7.30, 10.40)
స్క్రీన్-4 : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (10.05, 1.10, 4.15, 10.25)
: ఫలక్‌నామాదాస్ (7.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : జాక్ (10.45, 1.30, 4.20, 7.20, 10.20)
స్క్రీన్-2 : గుడ్ బ్యాడ్ అగ్లీ (1.40, 10.20)
: ఫలక్‌నామాదాస్ (4.30)
: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (7.30)
స్క్రీన్-3 : జాట్ (హిందీ) (11.00, 1.40, 7.30)
: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (4.30, 10.30)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మ్యాడ్ స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్